ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
మంగళవారం 18 నవంబరు 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 । కనిష్ఠం : 16.0


ఉమామహేశ్వరం క్షేత్రంలో కార్తీక దీపంతో చిన్నారి

దీపాలకు నమస్కరిస్తున్న మహిళ

దీపం జ్యోతి పరబ్రహ్మ

» కార్తీక మాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు
» భక్తులతో కిటకిటలాడిన ఉమామహేశ్వరం
» అలంపూర్ ఆలయ ప్రాంగణంలో దీపారాధన

అచ్చంపేట/అలంపూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉమామహేశ్వరం, జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ క్షేత్రాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువ జామునే ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలను వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఉమామహేశ్వరంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికారులు కొండ దిగువన భోగ ఉమామహేశ్వరంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. భక్తులను ఆలయం వద్దకు తీసుకెళ్లేందుకు 3 మినీ బస్సులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర స్వామికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆయనకు పాలక మండలి చైర్మన్ మాదవరెడ్డి, ఈవో శ్రీనివాస్ రావు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పాపనాశిని గుండంలో ఆయన పుణ్యస్నానం చేసి, ఈశ్వరుడికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. గణపతి, అయ్యప్ప స్వాములకు పూజలు చేశారు. అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక నిధులతో క్షేత్రంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయానికి వెళ్లే దారిలో చెక్‌పోస్టును ఎత్తివేయాలని భక్తులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

● అలంపూర్ క్షేత్రం, ఐదవ శక్తి పీఠం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొన్నది. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో గంటల కద్దీ వేచి ఉండాల్సి వచ్చింది. క్షేత్రానికి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర పుష్కరఘాట్ వద్ద పుణ్యస్నానాలు చేసి, కార్తీక దీపాలు వెలిగించి నదిలో వదిలారు. స్వామి, అమ్మవారి ఆలయాల ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన చేశారు.


అలంపూర్‌లో కార్తీక దీపం వెలిగిస్తున్న యువతి


అలంపూర్ ఆలయ ఆవరణలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు


అలంపూర్‌లో తుంగభద్ర తీరాన దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ఉమామహేశ్వరంలో దీపానికి మొక్కుతున్న మహిళ

విద్యుత్ శాఖ ప్రజాబాట

» కరెంటు సమస్యల పరిష్కారమే లక్ష్యం
» క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పర్యటన
» ప్రజల నుంచి ఫిర్యాదులు, సలహాల స్వీకరణ
» వారంలో 3 రోజులు కార్యక్రమం నిర్వహణ


వనపర్తిలో ట్రాన్స్‌ఫార్మర్‌పై పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది (ఫైల్)

6

పార్టీ విస్తరణకు కృషి చేయాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

డీసీసీ సారథిగా కూచకుళ్ల రాజేశ్ రెడ్డి?

» వారంలోగా అధికారికంగా ప్రకటన
» మంత్రి, ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం

నాగర్‌కర్నూల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డికి దక్కనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మంత్రి జూపల్లి కృష్ణారావు సహా అచ్చంపేట, కల్వకుర్తి ఎమ్మెల్యేలు కూడా మద్దతు తెలిపినట్లు తెలిసింది. దీంతో వారం రోజుల్లో కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి పేరును ఖరారు చేస్తూ ఏఐసీసీ అధికారికమైన ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు విశ్వసనీయమైన సమాచారం. ఎంపీ మల్లురవి కూడా జిల్లా ఎమ్మెల్యేల అభిప్రాయం వైపు మొగ్గు చూపడంతో రాజేశ్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవిని అప్పగిస్తూ ఏఐసీసీ చేయనున్న ప్రకటన లాంఛనప్రాయంగా మారింది.

పోటీలో 16 మంది నాయకులు

నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి 16 మంది పోటీలో ఉన్నప్పటికీ నిబంధనలను పక్కన పెట్టి ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి వైపే అధిష్ఠానం మొగ్గు చూపింది. పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి గత నెలలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ అంతర్గత సమావేశంలో జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తులను స్వీకరించారు. దాదాపు పదేళ్లపాటు జిల్లా అధ్యక్ష పదవిని సమర్థవంతంగా చేపట్టిన చిక్కుడు వంశీకృష్ణ ఈ సారి బాధ్యతలు నిర్వర్తించేందుకు విముఖత కనబర్చారు. అచ్చంపేట ఎమ్మెల్యేగా ప్రజా క్షేత్రంలో ఉండాల్సిన నేపథ్యంలో తాను తిరిగి కొనసాగలేనని ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామికి స్పష్టంగా తెలియజేశారు. ఈ క్రమంలో జిల్లా పార్టీకి సారథ్యం వహించే అంశంలో అనేక తర్జనభర్జనలు జరిగాయి. నారాయణస్వామి నాగర్‌కర్నూల్‌కు వచ్చే ఒక రోజు ముందుగానే హైదరాబాద్‌లోని మంత్రి జూపల్లి కృష్ణారావు నివాసంలో సమావేశమైన జిల్లా ఎమ్మెల్యేలు, ప్రధాన నాయకులు, కూచకుళ్ల రాజేశ్‌రెడ్డికి అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే సముచితంగా ఉంటుందనే అభిప్రాయాన్ని కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్‌కు కూడా పూసగుచ్చినట్లు వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి బీఆర్ఎస్ తరఫున రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది బలమైన నాయకుడుగా ఉన్న మర్రిజనార్దన్‌రెడ్డి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా నియామకమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కూచకుళ్ల రాజేశ్‌రెడ్డికి అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి ప్రయోజనకరంగా ఉంటుందని అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎమ్మెల్సీగా కొనసాగుతున్న కూచకుళ్ల దామోదర్‌రెడ్డి హుందాతనం, ఆయన కుమారుడు కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి యువ నాయకత్వం పార్టీ పురోభివృద్ధికి దోహదం చేస్తుందని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ కూడా భావిస్తున్నట్లు తెలుస్తోంది.


కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

ఆశావహులకు మరో అవకాశం

నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్ష పదవి కోసం 16 మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ, వారిలో ప్రధానంగా నలుగురికి ఇతరత్రా రాజకీయ అవకాశాలు కల్పిస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం భరోసా ఇచ్చినట్లు సమాచారం. జిల్లా మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న మహమ్మద్ హబీబ్, బ్లాక్ కాంగ్రెస్ బిజినేపల్లి అధ్యక్షుడు సుహాసన్‌రెడ్డి, కల్వకుర్తికి చెందిన కాయితి విజయ్‌కుమార్‌రెడ్డి, కొల్లాపూర్‌లో బీసీ నాయకుడు రాములుయాదవ్‌కు నామినేటెడ్ పదవులు లేదా పార్టీపరంగా ఉన్నతమైన అవకాశాలు కల్పిస్తామని ఎంపీ మల్లు రవి, జూపల్లి కృష్ణారావులు కూడా భరోసా ఇచ్చినట్లు సమాచారం.

దీనివల్ల డీసీసీ అధ్యక్ష పదవి వ్యవహారం సాఫీగా జరిగిపోనుందని కాంగ్రె స్‌లోని విశ్వసనీయమైన వర్గాలు పేర్కొంటున్నాయి.

చల్లని చలి.. వెచ్చని ఒడి..



రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. సాయంత్రం నుంచే చలి గాలులు వీస్తున్నాయి. ఉదయం 10 గంటల వరకు తగ్గడం లేదు. దీంతో మనుషులతో పాటు, జంతువులు కూడా వణికిపోతున్నాయి. ఇలా చలికి వణికి పోతున్న పిల్లలను తల్లి వానరం అక్కున చేర్చుకొన్నది. ఒడిలో వెచ్చదనాన్ని ఆస్వాదిస్తూ కనులు మూసుకున్న చిన్న వానరాలు సోమవారం ఉదయం ఉమామహేశ్వర క్షేత్రంలో 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంటపడటంతో 'క్లిక్'మనిపించింది.

– అచ్చంపేట (ఆంధ్రజ్యోతి)

నెరవేరిన పేదల సొంతింటి కల

» గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి » ఇందిరమ్మ గృహ ప్రవేశానికి హాజరు


గృహప్రవేశం సందర్భంగా లబ్ధిదారుకు కానుకలు ఇస్తున్న ఎమ్మెల్యే, ఎంపీడీవో

గద్వాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : పేదల సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేర్చారని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలంలోని బస్వచెరువు గ్రామంలో లబ్ధిదారు పద్మమ్మ నిర్మించుకున్న ఇందిరమ్మ గృహ ప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గృహ ప్రవేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లుల చింతలేదన్నారు. పునాది వేసినప్పటి నుంచి వారి ఖాతాలలో డబ్బులు జమ అవుతున్నాయని చెప్పారు. ఇలా దశల వారీగా బిల్లులు వెనువెంటనే మంజూరవుతున్నాయని తెలిపారు. గతంలో మాదిరి దళారుల ప్రమేయం లేకుండా, అధికారులే పరిశీలించి ఫొటోలు తీసి బిల్లులు చేస్తున్నారని వివరించారు. నియోజకవర్గంలో 1,500 ఇళ్ల నిర్మాణం త్వరలో పూర్తి అవుతుందన్నారు. మిగిలిన వారు నిర్మాణాలు చేపట్టకపోతే వారి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

» నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో సమీపంలో, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ డిసెంబరులోగా గృహాల ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా మొత్తం 195 ఇళ్లలో మిగిలిన పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రధాన రహదారి నుంచి ఇళ్ల వరకు రహదారి పనులను పూర్తి చేయాలని సూచించారు.

ఇళ్ల పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దేవ సహాయం, గృహ నిర్మాణ శాఖ అధికారి సంగప్ప, ఈఈ పంచాయతీరాజ్ విజయ్‌కుమార్, మునిసిపల్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

వ్యవసాయానికి పెద్దపీట

» వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందని, తద్వారా రైతులు అభివృద్ధి చెందుతున్నారని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అపోహలకు గురికావొద్దన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివన్న, నాయకులు కొంకి వెంకటేశ్, కేతేపల్లి వెంకటయ్య, పిట్టల రవి కుమార్, ధీరమల్లు, నాగరాజు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

6

» మాదాసి కుర్వ, మాదారి కుర్వల డిమాండ్ » నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముట్టడి

ముగిసిన కురుమూర్తి బ్రహ్మోత్సవాలు

» ఆత్మకూరు ఎస్‌బీఐకి స్వామి వారి ఆభరణాలు
» మరో 15 రోజులు కొనసాగనున్న భక్తుల రద్దీ

చిన్నచింతకుంట/ ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలో కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి అలంకరించిన స్వర్ణాభరాలను తొలగించారు. ఆలయ ఆవరణలో చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ ఎల్లయ్య, ఎస్ఐ ఓబు లేరెడ్డి, పాలకవర్గ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, పెట్టెలో ఉంచారు. అనంతరం ప్రధాన ఆలయం నుంచి రాజగోపురం గుండా ఆత్మకూరుకు తరలించారు. అక్కడి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని ప్రత్యేక లాకర్‌లో భద్రపరిచారు. అయితే మరో 15 రోజుల పాటు జాతరలో భక్తుల రద్దీ కొనసాగనున్నది. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ సారి గతం కంటే అధికంగా భక్తులు తరలివచ్చారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ ఎల్లయ్య, పాలకవర్గ సభ్యులు, భాస్కరాచారి, భారతమ్మ, నాగరాజు, ఉంద్యాల శేఖర్, బాదం వెంకటేశ్వర్లు, అర్చకులు వెంకటయ్య, విజయ్, సత్యం, ఎస్ఐ ఓబుల్‌రెడ్డి, శివానంద చారి పాల్గొన్నారు.


ఆభరణాలను పరిశీలిస్తున్న చైర్మన్, ఈవో తదితరులు

పత్తి రైతులను మోసం చేయొద్దు

» బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య
» గద్వాల కలెక్టరేట్ ముందు నిరసన


కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు

గద్వాల న్యూటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేయొద్దని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు పత్తివాహనంతో వచ్చిన రైతులతో కలిసి నిరసన తెలిపారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని శ్రీబాలాజీ కాటన్‌మిల్లు వద్ద రైతులు చేపట్టిన ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లుకు రైతులు తీసుకొచ్చిన పత్తిని కొనకపోవడం విచారకరమన్నారు. రైతులకు ముందుస్తు సమాచారం ఇచ్చి ఉంటే కాటన్‌మిల్లుకు పత్తిని తీసుకొచ్చేవారు కాదని తెలిపారు. అధికారుల నిర్లక్ష్య వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏడు క్వింటాళ్ల కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేసారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో రైతులు తులసీగౌడు, మునిస్వామిగౌడు, రాజు, నర్సింహులు, వినోద్, సింహాద్రి, రవి పాల్గొన్నారు.

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

» మాదాసి కుర్వ, మాదారి కుర్వల డిమాండ్

» నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముట్టడి



కలెక్టర్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న మాదాసి మాదారి కుర్వలు

కందనూలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను బేషరతుగా జారీ చేయాలని మాదాసి కుర్వ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కుర్వ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం నాగర్‌కర్నూల్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొల్లాపూర్ పట్టణంలో మాదాసి కుర్వ కులస్థులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను పరిష్కరించకపోతే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించి, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఊరె మల్లయ్య, రాష్ట్ర నాయకులు ధర్మయ్య, బీరయ్య, పర్వతాలు, రాధాకృష్ణ, రాములు, కట్టె భాస్కర్, కత్త శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తితో అధిక లాభాలు

» పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఎంవీ నగేష్ కుమార్



మహదేవునిపేటలోని రైతు పొలంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఎంవీ నగేష్ కుమార్

బిజినేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లోనే నాణ్యమైన విత్తనోత్పత్తి చేపడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, రాజేంద్రనగర్ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఎంవీ. నగేష్ కుమార్ అన్నారు. నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మహాదేవునిపేట గ్రామానికి చెందిన మహిళా రైతు విజయ పొలంలో తాము పంపిణీ చేసిన కేఎన్‌ఎం-1638 అనే వరి రకం పంటను పరిశీలించి రైతులకు విత్తనోత్పత్తి ద్వారా కలిగే లాభాలను వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 1,044 మంది ఉత్తమ రైతులను గుర్తించి వారందరికీ ఉచితంగా కేఎన్‌ఎం-1638 వరి విత్తనం అందజేసి విత్తనోత్పత్తిని ప్రోత్సహించినట్లు తెలిపారు. విత్తనోత్పత్తి చేపట్టే విత్తన రకం, పంట కాలం, నీటి వినియోగం, తెగుళ్లను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకొని విత్తుకోవాలని సూచించారు. పాలెంలోని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ఎల్.కృష్ణ మాట్లాడుతూ యాసంగిలో సాగు చేసే వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, తెగుళ్ల నివారణకు చేపటాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ బి.రాజశేఖర్, డాక్టర్ ఒంగోలు శైల ఉన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

» ఆర్‌జేడీ విజయలక్ష్మి



అయిజలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి

అయిజ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆర్‌జేడీ విజయలక్ష్మి ఆదేశించారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో సోమవారం అయిజ, గట్టు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఉన్నత, కేజీబీవీల్లో విద్యార్థుల రిజిస్ట్రేషన్‌లు కాకుండా యాక్టివిటి శాతాన్ని పెంచాలని, పాఠశాలలకు సంబంధించి యూడైస్ వివరాలను కచ్చితంగా సమయానుకూలంగా నమోదు చేయాలని తెలిపారు. విద్యాశాఖకు సంబంధించిన యాప్‌ల నిర్వహణ, డేటా నమో దు, పాఠశాల పనితీరు, పర్యవేక్షణలో ఆధునిక సాంకేతికతను వినియోగిం చాలని సూచించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పనికిరాని వస్తు సామగ్రి ఉపయోగంలోకి తెచ్చుకునే ప్రయత్నాలు చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన తరగతి గదులకు మరమ్మతు చేయించి ఉపయోగించు కోవాలన్నారు. అయిజ ఎంఈవో రాములు, గట్టు ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల సమక్షంలోనే మందుల విక్రయం

» ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ దినేశ్‌కుమార్



మహబూబ్‌నగర్‌లోని మందులను తనిఖీ చేస్తున్న ఏడీ దినేశ్‌కుమార్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ దుకాణాల్లో ఫార్మసిస్టుల సమక్షంలోనే మందులు విక్రయించాలని ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ దినేష్‌కుమార్ ఆదేశించారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, గద్వాల, వనపర్తి పట్టణాల్లోని మెడికల్ దుకాణాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల విక్రయాలు, కొనుగోలు, నిల్వ, ఫార్మసిస్టుల విద్యార్హతలు తదితర అంశాలు, రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లింగ్, షెడ్యూలు, హెచ్, హెచ్1 రిజిస్టర్లు, డ్రగ్ లైసెన్సు ధ్రువపత్రాలను కూడా తనిఖీ చేశారు. మొత్తం 16 మెడికల్ దుకాణాల్లో నిబంధనలు పాటించడం లేదని గుర్తించి, షోకాజ్ నోటీసులను జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ మందుల దుకాణంలో ఫార్మసిస్టు ఉండాలన్నారు. లేకపోతే లైసెన్సులు రద్దు చేసేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. తనిఖీల్లో ఆయా జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు రఫీ, రశ్మి, విశ్వంత్‌రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద స్వల్పంగా వస్తున్న కారణంగా ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో రెండు యూనిట్లు ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఒక యూనిట్ ద్వారా 0.595 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 506.583 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఒక యూనిట్ ప్రారంభించి 0.733 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 498.511 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ శాఖ 'ప్రజాబాట'



గ్రామాలకు తరలించడానికి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

» కరెంటు సమస్యల పరిష్కారమే లక్ష్యం

» క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పర్యటన

» ప్రజల నుంచి ఫిర్యాదులు, సలహాల స్వీకరణ

» వారంలో 3 రోజులు కార్యక్రమం నిర్వహణ

ఖిల్లాఘణపురం ,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు, పట్టణాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విద్యుత్ శాఖ అధికారులు 'ప్రజాబాట' కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడుతున్నారు. విద్యుత్ సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. వారి నుంచి సలహాలు, సూచనలను స్వీకరిస్తున్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ల నుంచి ఆర్టిజన్ స్థాయి వరకు అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం వనపర్తి జిల్లాలోనూ విస్తృతంగా కొనసాగుతోంది.

వెల్లడవుతున్న సమస్యలు

వనపర్తి జిల్లా పరిధిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 64 ఉన్నాయి. ఖిల్లాఘణపురం మండలంలోని అల్లమాయపల్లి, పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామాల్లో కొత్తగా సబ్ స్టేషన్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మరో 15 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణ ప్రక్రియ టెండర్ స్థాయిలో ఉంది. సబ్‌స్టేషన్ల సామర్థ్యాల పెంపు అనివార్యంగా మారింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 21 వేల ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వ్యవసాయానికి అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లకు 4,573 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

దాదాపు 4,500 ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రతిపాదనలను సిద్ధం చేసి, ఏర్పాటుకు సిద్ధం చేశారు. వానాకాలం వరి కోతలు పూర్తయిన అనంతరం ట్రాన్స్‌ఫార్మర్లను బిగించనున్నారు. జిల్లాలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సామగ్రి కొరత లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

అలాగే లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి రాబోయే వేసవికాలం లోపు 406 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. గ్రామాల్లో కొత్తగా 199 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్య, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోనున్నారు.

ప్రజల నుంచి వినతులు

వారంలో మూడు రోజుల పాటు మంగళ, గురు, శనివారాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఎస్‌ఈ, ఏడీఈ, ఏఈల నుంచి లైన్‌మెన్, ఆర్టిజన్ స్థాయి సిబ్బంది వరకు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్నారు. సాధారణ సమస్యలైతే అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నారు. పెద్ద సమస్యలుంటే ప్రతిపాదనలను సిద్ధం చేసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. అలాగే విద్యుత్ సరఫరా వ్యవస్థను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, సూచనలు స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్ లైన్లను మార్చాలని ప్రజల నుంచి ఎక్కువగా వినతులు వచ్చాయి. అలాగే ఇళ్ల సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని, విద్యుత్ స్తంభాలను దూరంగా ఏర్పాటు చేయాలని సూచనలు వచ్చాయి.

విద్యుత్ తీగల కిందనున్న చెట్ల కొమ్మలి తగిలి తరచూ విద్యుత్ సరఫ రాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు చెప్పారు.

ప్రజా బాటతో సమస్యల పరిష్కారం



ప్రజాబాట కార్యక్రమంతో విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. ఏబీ స్విచ్, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పొదల తొలగింపు, ఎర్తింగ్ లోపాల సవరణ, విద్యుత్ సరఫరా, లైన్ల కింద చెట్ల కొమ్మల నరికివేత, లైన్ల మరమ్మతులు అప్పటికప్పుడు చేపడుతున్నాం. ఫీజుల మరమ్మతు, కొత్త తీగలు వేయడం, లోడ్ బ్యాలెన్సింగ్ వంటి చర్యలు తీసుకుంటున్నాం.

– రాజశేఖరం, విద్యుత్ ఎస్ఈ, వనపర్తి



పెద్దమందడి ప్రజా బాటలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

జీరో వ్యాపారం చేస్తే కఠిన చర్యలు

» బాదేపల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్

» కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లకు హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జడ్చర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీరో వ్యాపారం నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని మహబూబ్‌నగర్ జిల్లా, బాదేపల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజేందర్ గౌడ్, మార్కెట్ కార్యదర్శి అశ్వక్‌అహ్మద్ హెచ్చరించారు. ఈ నెల 16న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురి తమైన 'బాదేపల్లి మార్కెట్‌లో జోరుగా జీరో వ్యా పారం' కథనానికి వారు స్పందించారు. కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లతో సోమవారం మార్కెట్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జీరో వ్యాపారం చేస్తే కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్ల లైసెన్సులను రద్దు చేసేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. జీరో దందాపై ప్రత్యేక నిఘా పెడ్తా మని వెల్లడించారు. సమావేశంలో మార్కెట్ కమి టీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అలసత్వంపై విచారణ

ఉప్పునుంతల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వృద్ధాప్య, వికలాంగులకు పెన్షన్లు పంపిణీలో అలసత్వం వహిస్తున్న బీపీఎం మరళిపై సోమవారం ఎంపీడీవో వరుణ్‌తేజ విచారణ చేపట్టారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధాప్య, వికలాంగులను బీపీఎం ఇంటికి పిలుచుకొని పెన్షన్లు పంపిణీ చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీవో వెంకటేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి, మానవ హక్కుల కౌన్సిల్ సభ్యుడు చంద్ర ఉన్నారు.

పార్టీ విస్తరణకు కృషి చేయాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

పాలమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల్లో పార్టీ విస్తరణకు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ పట్టణంలో సోమవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సాగర్, జయలక్ష్మిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిజం, సోషలిజంతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఓట్లను కొల్లగొట్టేందుకు బిహార్‌లో 65 లక్షల ఓట్లను తొలగించటం అప్రజాస్వామికమన్నారు. అమెరికా రాజధాని న్యూయార్క్‌లో మేయర్ అభ్యర్థి జోహ్రాన్ మమ్దాని గెలవడం సోషలిస్టులు, కమ్యూనిస్టులకు నూతనోత్తేజం కలిగించిదన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు సోషలిజమే ప్రత్యామ్నాయమని చెప్పారు.

అభివృద్ధిలో అమెరికాను చైనా అధిగమించనున్నదన్నారు. సమావేశంలో సీపీయం జిల్లా కార్యదర్శి ఎ.రాములు, వనపర్తి జిల్లా కార్యదర్శి జబ్బార్, నారాయణపేట కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, కిల్లెగోపాల్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు, నల్లవెల్లి కురుమూర్తి, ఖమర్‌అలీ, ఆదివిష్ణు, హన్మంతు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

» అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పబ్బతి ఆంజనేయ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, పదర మండలంలోని మద్దిమడుగు క్షేత్రంలో ఈనెలాఖరున ప్రారంభం కానున్న ఉత్సవాలపై సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. పాలకమండలి సభ్యులు, ఈవో, అధికారులు పాల్గొన్న సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలన్నారు. త్వరలోనే ఆలయ ఆవరణలో సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆలయ చైర్మన్ రాములు నాయక్, అధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడి రిమాండ్

ఊర్కొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు నమోదు అయిన సంఘటనలో యువకుడిని సోమవారం రిమాండ్ చేశారు. ఎస్ఐ కృష్ణదేవ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఊర్కొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను గుడిగానిపల్లి గ్రామానికి చెందిన యువకుడు గుండూరు పరమేష్ అలియాస్ పాపయ్య కాలే లైంగికంగా వేధించడంతో బాలిక తల్లిదండ్రులకు తెలియజేసింది. వారు నవంబరు 1న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామని ఎస్ఐ తెలిపారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి ఆదేశం మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

బస్సుల కోసం భక్తుల పడిగాపులు



బస్సు కోసం ఎదురుచూస్తున్న భక్తులు, స్థానికులు

అలంపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని సోమవారం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కానీ వారు తిరిగి వెళ్లేందుకు బస్సులు అందుబాటులో లేకపోవడంతో పట్టణంలోని బస్టాండ్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశ పెట్టింది కానీ.. పల్లెలకు బస్సులు నడపడం లేదని మహిళలు ఆగ్రహానికి గురయ్యారు. ప్రముఖ పుణ్య క్షేత్రం ఉన్నా కూడా పర్వదినాలలో ప్రత్యేక బస్సులకు నడపడం లేదని భక్తులు మండిపడ్డారు. కొన్ని గంటల పాటు వేచి ఉన్నామని, కనీసం ఒక్క బస్సు కూడా రావడం లేదని భక్తులు వాపోయారు.

ఆస్తి పంచేటప్పుడు షరతులు విధించాలి

» న్యాయాధికారి ఇందిర



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి ఇందిర

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తిని పంచేటప్పుడు, బహుమతిగా ఇచ్చేటప్పుడు షరతులు విధించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా, సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వృద్ధుల సంరక్షణ కోసం 2007లో చేసిన చట్టం కఠినంగా ఉందని తెలిపారు. పిల్లలు తల్లిదండ్రులను పోషించకపోయినా, అవసరమైన ఖర్చులకు డబ్బు ఇవ్వక పోయినా వారికి 3 నెలలు జైలు శిక్ష, 5 వేల రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. ఈ చట్టం కింద ఫిర్యాదు చేసేందుకు వృద్ధులు నేరుగా ఆర్డీవోను సంప్రదించొచ్చని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం మాట్లాడుతూ వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. సదస్సులో ఫోరం ఉపాధ్యక్షుడు రాజసింహుడు, కార్యదర్శి నస్కంటి నాగభూషణం, సాయిల్‌గౌడ్, అంజయ్యాచారి శివన్న పంతులు, రాములు, బాలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గండీడ్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యులతో గొడవ పడి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, గండీడ్ మండలంలోని వెన్నచేడులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రయ్య (65) కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. ఆ తర్వాత లింగయిపల్లిలోని తన బంధువుల ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన వారు 108 అంబులెన్సులో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జోగుళాంబ సన్నిధిలో విజిలెన్స్ కమిషనర్



విజిలెన్సు కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న ప్రధాన అర్చకులు

అలంపూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐదో శక్తి పీఠం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని సోమవారం రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్ సతీ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వీరికి ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకం అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు



సదర్ ఉత్సవానికి దున్నపోతును తీసుకొస్తున్న యాదవులు

కోస్గి, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కోస్గి పట్టణంలో సోమవారం రాత్రి సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి శివాజీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిర్వహించిన దున్నపోతుల విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. కార్యక్రమంలో యాదవసంఘం నాయకులు పీరుంపల్లి శ్రీనివాస్య యాదవ్, హన్మంతుయాదవ్, నర్సింహులు యాదవ్, రమేశ్‌యాదవ్ తదితరులున్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీకి పెద్దకొత్తపల్లి విద్యార్థి ఎంపిక



విద్యార్థి శేఖర్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అండర్-17 బాల బాలికల అథ్లెటిక్స్ పోటీ ల్లో పెద్దకొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి టి.శేఖర్ జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శేఖర్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో కే శ్రీనివాస్‌రెడ్డి ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యం, ఉపా . ధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

వరి కోత యంత్రంలో పడి రైతు మృతి

పెద్దమందడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరి కోత యంత్రంలో పడి ఓ రైతు మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పెద్ద మందడి మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. అంకూరు గ్రామానికి చెందిన రైతు రాకాసి శ్రీనివాస్‌రెడ్డి (45) పెద్దమందడి మండలం జంగమాయపల్లి గ్రామ సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలంలో పంట కోస్తుండగా ప్రమాదవశాత్తు వరి కోత యంత్రంలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్రైం కార్నర్

ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరు చోరీ


తాటిపర్తి శివారులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

భూత్పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంట పొలాలకు అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దానిలో ఉన్న కాపర్ వైర్‌ను దొంగిలించుకుపోయారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతుల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన అనుప నర్సిములు, అనుప కృష్ణయ్య తమ వ్యవసాయం కోసం 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించుకున్నారు.

గత కొనేళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలం దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులో ఉన్న కాపర్ వైర్(రాగివైర్లు)ను ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని సోమవారం గమనించిన రైతులు విద్యుత్ శాఖ, పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మేఘ్యానాయక్(ఫైల్)

నవాబ్‌పేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కు వెళ్తున్న ఓ వ్యక్తిని వెనుకనుంచి వస్తున్న వాహనం ఢీకొనగా, అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కోళ్లగుట్టతండాకు చెందిన మేఘ్యానాయక్(46)షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉంటూ ప్రధాన రహదారిపై మిర్చిబండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం వాకింగ్ వెళ్లిన మేఘ్యానాయక్‌ను వెనుకనుంచి వస్తున్న భారీ వాహనాలు తీసుకెళ్లే క్రేన్ డ్రైవర్ అజాగ్రత్తవల్ల వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని ఇంటికి తరలించారు. మృతుడికి భార్య, పిల్లలున్నారని బంధువులు తెలిపారు.

రూ.9 లక్షల విలువైన 19 మోటార్లు స్వాధీనం


మోటార్ మెకానిక్ ఇంట్లో నుంచి స్వాధీనం చేసుకున్న మోటార్లు

కృష్ణ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మోటార్ మెకానిక్ బెడ్ రూంలో రూ.9 లక్షల విలువైన 19 మోటార్లను కర్ణాటక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలం పరిధిలోని గుడేబల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని టైరోడ్డు వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రాయచూర్ జిల్లా రూరల్ పీఎస్‌ఐ ప్రకాష్‌రెడ్డి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం... గంజహాళి గ్రామంలో వ్యవసాయ మోటార్ దొంగతనానికి పాల్పడుతున్న మోటార్ మెకానిక్ విజయ్ కుమార్, చేతికింద పని చేసే మరో యువకుడు హుస్సేన్, గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం విదితమే. పీఎస్‌ఐ ప్రకాష్ రెడ్డి, విజయ్ కుమార్, హుస్సేన్ తమదైన రీతిలో విచారణ నిర్వహించారు. విజయ్ కుమార్ 2 సంవత్సరాల నుంచి వివిధ ప్రాంతాల్లో దాదాపు 40 వ్యవసాయ మోటార్లు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దీంతో తన స్వంత ఇంట్లో బెడ్ రూమ్ బెడ్‌కింద, దుకాణంలో దాచిన 19 వ్యవసాయ మోటార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని టాటా ఏసీలో రాయచూర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అదే విధంగా దొంగతనానికి వాడిన మారుతి సుజుకి కారును సీజ్ చేసినట్లు, ఇంకా లోతైన విచారణ నిర్వహిస్తున్నట్లు ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు.

హత్య కేసులో

ఇద్దరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

రాజోలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో రాజోలి పోలీస్ స్టేషన్ పరిధిలోని బుడమర్సుకు చెందిన ఇద్దరు నిందితులకు జిల్లా కోర్టు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున జరిమానా విధించినట్లు రాజోలి ఎస్‌ఐ గోకారి సోమవారం తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని బుడమర్సు గ్రామంలో సాగునీటిని అక్రమంగా తరలిస్తున్న వారికి సర్ది చెప్పేందుకు వెళ్లిన కమిటీ సభ్యులపై దాడి చేసి హత్యకు ప్రయత్నించిన వారిపై బాధితుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హత్యాయత్నం రుజువు కావడంతో నిందితులు కుర్వ గోకారి, కుర్వ కాశన్నలకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ 2023 జనవరిలో అడిషనల్ సీనియర్ సివిల్ సెషన్స్ కోర్టు తీర్పు ఇవ్వగా, అట్టి తీర్పును సవాల్ చేస్తూ నిందితులు జిల్లా కోర్టుకు వెళ్లారు. కింది కోర్టు ఇచ్చిన తీర్పును జిల్లా కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ప్రేమలత సమర్థిస్తూ సోమవారం తీర్పును వెల్లడించారని ఆయన తెలిపారు.

కాటన్ మిల్లులో అగ్నిప్రమాదం

అలంపూరుచౌరస్తా, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని వరసిద్ధి వినాయక కాటన్ మిల్లులో స్వల్ప అగ్నిప్రమాదం నెలకొంది. కార్మికులు సకాలంలో స్పందించడంతో తృటిలో ఆస్తి నష్టం తప్పింది. సదరు కాటన్ మిల్లులో మూడువారాల క్రితం సీసీఐ కొనుగోలు ప్రారంభం అయ్యింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రైతులు పత్తిని విక్రయించేందుకు బారులు తీరుతున్నారు. ఈ క్రమంలో సోమవారం సమ్మె కారణంగా సీసీఐ కొనుగోలు లేకపోయినా మిల్లు నడుస్తుంది.

ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. గమనించిన కార్మికులు హుటాహుటిని నీటిపైపుల సాయంతో మంటలు ఆర్పివేశారు. అగ్నిమాపక యంత్రంతో సిబ్బంది వచ్చి పరిశీలించారు. అప్పటికే మంటలు చల్లపడటంతో తిరిగివెళ్లిపోయారు. మిల్లులో వేలాది క్వింటాళ్ల పత్తి నిలువ ఉంది. పత్తిని విక్రయించేందుకు వచ్చిన రైతులకు చెందిన పత్తి 80వాహనాల్లో బయట ఉంది. కానీ ఎలాంటి ఆస్తి నష్టం జరగకపోవడంతో ఇటు మిల్లు యజమానులు, అటు సీసీఐ అధికారులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పట్టు బడిన ట్రాక్టర్లు

రాజాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, ఓ జేసీబీని పట్టుకున్నట్లు సోమవారం ఎస్‌ఐ శివానందం పేర్కొన్నారు. ముదిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ నందిగామ గ్రామం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని కృత్రిమ ఇసుకగా తయారు చేసి తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల ను, ఓ జేసీబీని బ్లూకోర్టు డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ సత్యనారాయణ, కిరణ్ భార్గవ్‌లు పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

నారాయణపేటలో బొలెరో..

నారాయణపేట టౌన్, (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌక్ వద్ద సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక బొలెరో వాహనాన్ని ఆపి పరిశీలించగా, అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు బయటపడింది. డ్రైవర్ దామరగిద్ద మండలం, ఉలిగుండం గ్రామానికి చెందిన చింతమొల్ల రమేష్ చెందిన వ్యక్తి వల్లంపల్లి నుంచి జాజపూర్ వైపు అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమయంలో పట్టుకున్నట్లు తెలిపారు. బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

చర్యలున్నా మారని తీరు!

● జోగుళాంబ గద్వాల జిల్లాలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- జిల్లా వ్యాప్తంగా 47,575 వివిధ కేసుల నమోదు
- రూ. 1.60 కోట్ల జరిమానాలు
- ట్రాఫిక్ నియంత్రణపై 95 అవగాహన సదస్సులు


విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ(ఫైల్)

గద్వాల క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నా అందుకు తగ్గ మార్పు కానరావడం లేదు. ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసులు లేకన్నా ఏఆర్ పోలీసులను ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు చేపడుతున్నా.. కేసులు మాత్రం రెట్టింపు అవుతూనే ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో ట్రాఫిక్ సమస్యను అదుపులో పెట్టేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. ప్రత్యేకంగా కొందరు ఏఆర్ పోలీసుల ద్వారా ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల కంటే ట్రాఫిక్ సమస్య కేవలం జిల్లా కేంద్రంలో ఎక్కువగా ఉంది. దీంతో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేకంగా 10 మంది ఏఆర్ సిబ్బందితో ట్రాఫిక్ బెల్టును ఏర్పాటు చేసి చర్యలు చేపడుతున్నారు.

● గత 11 నెలల్లో 47,575 కేసులు నమోదు

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు 15 వరకు జిల్లా కేంద్రంలో మాత్రమే మొత్తం 47,575 వివిధ కేసులకు గాను 1,06,34,900 జరిమానాను విధించినట్లు డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. ఇందులో ఈ-చలాన్ల కింద 24,954 కేసులు నమోదు కాగా ఇందుకు గాను రూ. 92.60.40 జరిమానాలు, అలాగే స్పాట్ చలాన్లు 4895కు గాను రూ. 649,500 జరి వ హానా, హెల్మెట్ లేని కేసులు 16,180 నమోదు కాగా, రూ. 26,50,200 జరిమానా విధించారు.



ట్రాఫిక్ రహిత జిల్లాగా మారేలా కృషి చేయాలి

జోగుళాంబ గద్వాల జిల్లాలో, ముఖ్యంగా జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను పూర్తి స్థాయిలో అదుపులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం. ప్రతీ వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాల సంఖ్య వీలైనంత తక్కువగా ఉంటుంది. ముఖ్యంగా త్వరలోనే ఆటోలకు పోలీసులు ప్రత్యేక నంబరింగ్ ఇవ్వడంతో పాటు ఆటోలపై ఎస్‌ఐ, సీఐల నంబర్లు కూడా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. గద్వాల జిల్లాను ట్రాఫిక్ రహిత జిల్లాగా మారేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలి. ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేస్తే చర్యలు తప్పవు.

\- మొగులయ్య, డీఎస్పీ, గద్వాల

అలాగే, జిల్లా కేంద్రంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 905 మందిపై కేసులు నమోదు చేయగా ఇందులో 3 నేషనల్ లోక్ అదాలత్‌కు సంబంధించి 641 కేసులకు గాను రూ. 7,25,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ బాలచంద్రుడు తెలిపారు. ఇప్పటివరకు ఆటోలు, లారీలు, వాహనాల యజమానులతో 95 అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ట్రాఫిక్ నియంత్రణకు కృషి జరిగేలా చూశామన్నారు.

మైనర్ వాహన డ్రైవింగ్‌కు సంబంధించి 54 కేసులు నమోదు చేయడంతో పాటు తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.

1400 నిఘా నేత్రాలు

జిల్లాలో మొత్తం 1400 సీసీ కెమెరాలు ఉండగా ఇందులో గద్వాల జిల్లా కేంద్రంలోనే 104 ఉన్నాయి. అయితే జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రధాన కూడళ్లలో ఉన్న కెమెరాలను గద్వాల పోలీస్ కంట్రోల్ రూమ్‌కే కాకుండా హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)కి కనెక్ట్ ఇవ్వడం జరుగుతుందని డీఎస్పీ తెలిపారు.

పొలం ఇంకొకరి పేరుపై మార్పు

- మనస్తాపంతో మహిళ మృతి
- మృతదేహంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన

తెలకపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తన పొలం ఇంకొకరి పేరుపై మారడంతో మనస్తాపానికి గురైన మహిళ మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కలిసి మృతదేహంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సంఘటన సోమవారం తెలకపల్లిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. తెలకపల్లి మండల పరిధిలోని బొప్పెల్లికి చెందిన నేరడి లాలమ్మకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక ఎకరా 21 గుంటలు రావడం జరిగింది. ఈ భూమి ధరణి వచ్చిన తర్వాత అదే గ్రామానికి చెందిన గుంటూరు నరసయ్య పేరు మీద నమోదయింది. దీంతో పొలం తన పేరు మీదికి మార్చుకోవడానికి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ గత నాలుగు నెలలుగా తిరుగుతున్నా పని కాకపోవడంతో అనారోగ్యానికి గురై తన పొలం రాదన్న బెంగతో సోమవారం మృతి చెందింది. అయితే, ఆమె కుటుంబ సభ్యులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సదరు మహిళ మృతదేహం ఉంచి ఆందోళనకు దిగారు. తహసీల్దార్ జాకీర్ అలీతో వాగ్వాదానికి దిగారు. లాలమ్మ పొలం నరసయ్య పేరు మీద ఎలా అయిందంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా లాలమ్మ పొలాన్ని ఆమె వారసులైన పిల్లలపైన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై తహసీల్దార్ స్పందిస్తూ త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు తమ ఆందోళనను విరమించుకున్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు గ్రామ నాయకుడు భగవంతురావు, మల్లాచారి తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

గచ్చుబావి శివాలయంలో ఎమ్మెల్యే పూజలు

- ఆలయాన్ని పరిశీలించిన ఆర్కిటెక్చర్ కల్పన రమేష్

కల్వకుర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని పురాతన గచ్చుబావి శివాలయం, కోనేరు అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. గచ్చుబావి శివాలయాన్ని సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, ప్రముఖ ఆర్కిటెక్చర్ కల్పనా రమేష్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారితోపాటు పలువురు ప్రముఖులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జడ్పీ మాజీ వైస్ చైర్మన్‌తో పాటు, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రమదానం చేశారు. అనంతరం ఆర్కిటెక్చర్ కల్పనా రమేష్, శివాలయం, కోనేరు పరిసరాలను పరిశీలించారు. కోనేరు మెట్లను సరి చేయాలని పూడిక తీయాలని ఆమె సూచించారు. వారితో పాటు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లెల రాములు కోనేరు మెట్ల మీద నిలబడి సెల్ఫీలు తీసుకున్నారు.


గచ్చుబావి శివాలయం కోనేరు మెట్లను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి పరిశీలిస్తున్న కల్పన రమేష్

వందేళ్ల త్యాగాల చరిత్ర

- సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్ల వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి పల్ల వెంకట్‌రెడ్డి

కందనూలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల త్యాగాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. వంద సంవత్సరాల ముగింపు ఉత్సవంలో భాగంగా బయల్దేరిన సీపీఐ ప్రచార జాతా గద్వాలలో ప్రారంభమై సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న పల్ల వెంకట్‌రెడ్డి, ప్రచార జాతా రథసారథులు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ, సీపీఐ శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యం మాట్లాడారు. సీపీఐ వందేళ్ల త్యాగాల చరిత్ర నేటి సమాజానికి తెలియజేయడానికి ప్రచార జాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయ ప్రదం చేయాల్సిందిగా ఈ సందర్భంగా వారు కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ అధ్యక్షత వహించగా రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఆనంద్‌జీ, రాష్ట్ర సమితి సభ్యులు కేశవులుగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు తన్నీరు నరసింహ, ఈర్ల చంద్రమౌళి, పెబ్బేటి విజేయుడు, జిల్లా సమితి సభ్యుడు బొలెద్దుల శ్రీనివాస్, బొజ్జ శ్రీను, బండి లక్ష్మీపతి, మారేడు శివశంకర్, మధుగౌడ్, ఆంజనేయులు, తన్నీరు మల్లయ్య, వెంకటమ్మ, కిరణ్‌కుమార్, తుమ్మల శివుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పత్తి కొనుగోలు

- రైతుల నిరసనతో దిగివచ్చిన అధికారులు


కలెక్టర్‌తో మాట్లాడుతున్న గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల/అలంపూరు చౌరస్తా, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) జోగుళాంబ గద్వాల జిల్లాలోని బాలాజీ జిన్నింగ్ మిల్లుతో పాటు అలంపూర్ చౌరస్తాలోని వరసిద్ధి వినాయక్ జిన్నింగ్ మిల్లులో సోమవారం రాత్రి నుంచి కొనుగోలు ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం నుంచి జిన్నింగ్ మిల్లుల యజమానులు సమ్మె నిర్వహించడంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. స్లాట్ బుక్ చేసుకున్న రైతులు ఉదయం నుంచి పత్తిని మిల్లుల దగ్గరకు తీసుకవచ్చారు. అయితే కొనుగోళ్లు నిలిచిపోవడంతో సాయంత్రం వరకు పడిగాపులు కాచారు. సహనం కోల్పోయిన రైతులు కొందరు వాహనాలతో కలెక్టరేట్‌కు తీసుకవచ్చి నిరసన వ్యక్తం చేయగా, మరికొందరు ఆయా మిల్లుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు స్పందించి రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. విషయం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుకు చేరడంతో వాళ్లు నేరుగా కలెక్టర్ బీఎం సంతోష్‌తో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోనే ఉన్న కలెక్టర్, ఎమ్మెల్యే బాలాజీ జిన్నింగ్ మిల్లుకు వెళ్లి రైతులతో మాట్లాడారు. అదే సందర్భంగా అలంపూర్ ఎమ్మెల్యే వరసిద్ధి వినాయక్ మిల్లు వద్దకు చేరి రైతులతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సీఎస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అదేవిధంగా సీసీఐ అధికారులతో మాట్లాడారు. దీంతో సీసీఐ అధికారులు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో రాత్రి 7 గంటల నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

రేపు జిల్లాస్థాయి కబడ్డీ జట్ల ఎంపికలు

గద్వాల అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 19వ తేదీన ఉదయం 9గంటలకు జిల్లాస్థాయి సీనియర్, జూనియర్స్ బాలబాలిల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డీకే స్నిగ్ధారెడ్డి, కబడ్డీ నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జూనియర్స్ బాలురు జనవరి 18, 2006న, బాలికలు డిసెంబరు 29, 2005న జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు జూనియర్స్ బాలికలు డిసెంబరు 2 నుంచి 4 వరకు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. బాలురు డిసెంబరు 5 నుంచి 7 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. సీనియర్స్ బాలబాలికల జట్టు డిసెంబర్ 11 నుంచి 14 వరకు కరీంనగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఐఈవో కౌసర్ జహన్

బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలి

- డీఐఈవో కౌసర్ జహన్
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ జిల్లా క్రీడాకారులు రాణించాలని జిల్లా ఇంటర్మీయట్ అధికారిణి కౌసర్ జహన్ అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-14, 19 బాల,బాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మేడ్చల్ నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఎంపికలకు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి, వ్యాయామ ఉపాధ్యాయులు ముక్రంం, శైలజ, రాకేష్, రామ్మోహన్, సతీష్ పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీలో రన్నర్‌గా నిలిచిన జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లో జిల్లాలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 నెట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలుర జట్టు రన్నర్‌గా నిలిచింది. సోమవారం స్థానిక స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారిణి కౌసర్ జహన్ జట్టును అభినందించారు. ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పీడీలు వేణుగోపాల్, ముక్రంం, శైలజ, రాంమోహన్‌పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీల్లో కెప్టెన్‌గా గౌతమ్


విద్యార్థిని అభినందిస్తున్న డీవైఎస్‌వో వెంకటేశ్‌శెట్టి

మక్తల్‌రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరులో భద్రాచలం వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్-17 క్రికెట్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ టీం కెప్టెన్‌గా మక్తల్ పట్టణంలోని గీతం పాఠశాల విద్యార్థి గౌతమ్ చంద్ర ఎంపికయ్యారు. తాజాగా నిర్వహించిన ఎంపికల్లో భాగంగా గౌతమ్ చంద్ర ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక కావడమే కాకుండా ఏకంగా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. డీవైఎస్‌వో వెంకటేశ్‌శెట్టి, ట్రస్మా సభ్యులు అంజిరెడ్డి, రమేశ్‌రావు, సత్యనారాయణగౌడ్, స్థానిక నాయకులు శ్రీనివాస్‌గుప్తా శాలువాతో గౌతమ్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, మణికంఠం సైతం పోటీలలో రాణించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


వినూతన్ రెడ్డి


స్వేచ్ఛ రెడ్డి

గద్వాల అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్‌కు విశ్వభారతి పాఠశాలకు చెందిన విద్యార్థులు వినూతన్ రెడ్డి, స్వేచ్ఛ రెడ్డి ఎంపికయ్యారని కరస్పాండెంట్ పి.త్యాగరాజు సోమవారం విలేకరులకు తెలిపారు. మహబూబ్‌నగర్ ఈ నెల 15న జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ షటిల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో విశ్వభారతి పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి కె.వినూతన్ రెడ్డి అండర్-17 సింగిల్స్ విభాగంలో రెండవ స్థానం సాధించారన్నారు. అదే విధంగా ఎనిమిదవ తరగతి విద్యార్థిని స్వేచ్ఛ రెడ్డి అండర్-14 విభాగంలో డబుల్స్‌లో విజేతగా, సింగిల్స్‌లో మూడవ బహుమతి సాధించారన్నారు. వీరిని కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తిరుమలేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గద్వాల క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గద్వాల పట్టణంలోని రైల్వేస్టేషన్ వాహనాల పార్కింగ్ ప్రదేశంలో గుర్తుతెలియని మగ మృతదేహం లభ్యమైనట్లు సోమవారం పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఇతని వయస్సు సుమారుగా 40 సంవత్సరాలు ఉంటుందని, ఎవరైనా గుర్తుపడితే వెంటనే పట్టణ ఎస్‌ఐకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- వి.సతీష్, ఎస్‌ఐ, పెద్దకొత్తపల్లి,



నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ వి.సతీష్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు మండలంలోని అన్ని గ్రామాల వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. మండల కేంద్రంలోని 167వ జాతీయ రహదారిపై, ప్రధాన రహదారులపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నాం. హెల్మెట్, సీటుబెల్టు ధరించి వాహనాలు నడపాలని అవగాహన కల్పిస్తున్నాం.

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారిపై ఎలాంటి చర్యలు ఉంటాయి?

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారు ఎంతటి వారైనా సరే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తాం. సానుకూల దృక్పథంతో కొన్నిసార్లు జరిమానా వేసి హెచ్చరించి వదిలిపెడుతున్నాం. వారిలో మార్పు రాకపోతే మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తాం.

మండలంలో ట్రాఫిక్ సమస్య ఎలా ఉంది ?

మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం మంగళవారంలో బస్టాండ్ చౌరస్తా నుంచి సంత బజార్ వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. అక్కడ రహదారిపై వాహనాలను అడ్డంగా నిలుపుతూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనదారులకు సూచిస్తూ అవగాహన కల్పిస్తున్నాం.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఊర్కొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని మండల విద్యుత్ శాఖ ఏఈ సాయన్నగౌడ్ తెలిపారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని 132/33 కేవీలో మరమ్మతుల కారణంగా మండల కేంద్రంతో పాటు జకినాలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

ఉపాధి హామీ కూలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అమ్రాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. అమ్రాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ కార్మిక సంఘం మండల సమావేశానికి పద్మ హాజరై మాట్లాడారు. నిరుపేద కూలీలకు ఆత్మీయ భరోసా కింద తక్షణమే రూ.12వేలు విడుదల చేయాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కూలీలకు రూ.10లక్షల బీమాను వర్తింప జేయాలని 57సంవత్సరాలు దాటిన కూలీలందరికీ రూ.5వేలు పెన్షన్ ప్రభుత్వం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని కూలీలకు దక్కకుండా చేయడానికి అనేక కుట్రలు పన్నుతుందని పద్మ తీవ్రంగా ఆరోపించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అమ్రాబాద్ తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు వ్యవసాయ కార్మిక సంఘం నేతలు వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ, మల్లేష్, పర్వతాలు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, అంజమ్మ, భాగ్యమ్మ, సులోచన, గోపాల్ పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సీఐటీయూ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ మండల మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోరాటాలకు కార్మికులంతా ఏకం కావాలని ఆయన కోరారు. నాయకులు పొదిల రామయ్య, రామకృష్ణ, కురుమయ్య, శాంతయ్య, కృష్ణ, లక్ష్మి, అమీనా, శిరీష, వెంకటమ్మ, జయమ్మ, రాజు, శ్రీనివాసులు, మోహన్, వెంకటయ్య, వెంకటస్వామి, సుభద్ర పాల్గొన్నారు.

పరమ పవిత్రం.. కార్తీక దీపం

- అచ్చంపేటలో కోటి దీపోత్సవం

కల్వకుర్తి/ అచ్చంపేటటౌన్/ తిమ్మాజిపేట/ ఊర్కొండ/ బిజినేపల్లి/ కోడేరు/ పెంట్లవెల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చివరి సోమవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆలయ అధ్యక్షుడు చంద్రశేఖర్ సమక్షంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు, మహిళలు పెద్దఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు. ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ● ఊర్కొండ మండలం రాచాలపల్లి గ్రామంలో సీతారామాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ విజయమ్మ, పాండురంగారెడ్డి ఉన్నారు. ● బిజినేపల్లి మండలం పాలెం వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సామూహిక సత్యనారా యణ స్వామి వ్రతాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కురవి రామానుజచార్యులు తెలిపారు. భక్తులకు ఆలయ మాజీ చైర్మన్ జున్నా శేఖర్‌రెడ్డి దంపతులు అన్నదానం చేపట్టారు. ● కోడేరు ఉమామహేశ్వర ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. ● పెంట్లవెల్లిలోని శివాలయం, మంచాలకట్ట శివాలయం, గోప్లాపూర్ ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

● కల్వకుర్తి పట్టణంలోని శివస్వాములకు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జిల్లెల రాములు, పలువురు నాయకులు, శివస్వాములు పాల్గొన్నారు.



రాచాలపల్లి సీతారామాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో సోమవారం అండర్-14 బాల బాలికల స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మునిసిపల్ చైర్మన్ శ్రీ నివాసులు, ఎంఈవో జీవన్‌కుమార్, పీటీలు క్రీడాకారులు, విద్యార్థులు ఉన్నారు.

గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ

బల్మూరు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేరరామాజీపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సోమవారం భూమి పూజ చేశారు. ఉపాధి హామీ పథకం నుంచి రూ.20లక్షలతో నిర్మించనున్నారు. అనంతరం మండల కేంద్రంలో రైతు వేదికలో సహకార సంఘం, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఓబీసీ సెల్ అధ్యక్షుడు గిరివర్ధన్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి కాశన్నయాదవ్, ఖదీర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అమ్రాబాద్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అమరేశ్వర ఆలయం చుట్టూ రూ.10 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ ఏర్పాటు, కోనేరు పునర్నిర్మాణ పనులకు సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ భూమి పూజ చేసి ప్రారంభించారు. అమరేశ్వరాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తిప్పర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అక్కడ కోటి దీపోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని జామే మసీద్ లోపల రూ.10లక్షలతో పూర్తి చేసిన సీసీనిర్మాణ పనులతో పాటు అక్కడే రెండు లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ డాక్టర్ అనురాధ, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అమరేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

నిరవధిక సమ్మెతో నిలిచిన పత్తి కొనుగోళ్లు

తాడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిరవధిక సమ్మె కారణంగా సోమవారం మండలంలోని రెండు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు నిలిపివేశారు. దీంతో శని, ఆదివారం సీసీఐ పత్తి కొనుగోలు అధికారికంగా నిలిపివేసినప్పటికీ సోమవారం సైతం మిల్లర్ల నిరవధిక సమ్మెకారణంగా పత్తి కొనుగోలు నిలిచిపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరుసగా మూడు రోజుల పాటు జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి కొనుగోళ్లు లేకపోవడంతో అన్నదాతలందరూ వాహనాల్లో మిల్లులవద్దకు పత్తి తీసుకొచ్చిసమ్మె ఉన్నందున విషయం తెలుసుకోవడంతో ఇంటికి తిరిగి వెళ్లిపోయారు. జిన్నింగ్ మిల్లుల సమ్మె మంగళవారం ఉన్నట్లయితే రైతుల పరిస్థితి ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఉంది.



తాడూరులోని జిన్నింగ్‌మిల్లు గేటుకు సమ్మె ఫ్లెక్సీ

ప్రతీ దరఖాస్తును పరిశీలిస్తాం

తిమ్మాజిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ సదస్సులు ఇచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి అన్నారు. మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో రెవెన్యూ గిర్దావర్ రవిచంద్ర, సర్వేయర్ సాయిబాబాతో కలిసి సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గతంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు ఇచ్చిన సాదా బైనామా భూభారతి దరఖాస్తులను పరిశీలించి సదస్సులో పాల్గొన్న రైతులతో విచారణ చేపట్టారు.

మాకు జరిగిన అన్యాయంపై స్పందించండి

- ముదిరాజ్ సంఘం నాయకులు

కొల్లాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాకు జరిగిన అన్యాయంపై స్పందించి, మా తరపున న్యాయ పోరాటం చేయాలని పలువురు కొల్లాపూర్ ముదిరాజ్‌లు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్‌ను ఇటీవల నాగర్‌కర్నూల్‌లో కలిసి కోరారు. గతంలో కొల్లాపూర్ మునిసిపల్ కమిషనర్‌గా పని చేసిన అధికారులు ముదిరాజ్ కమ్యూనిటీ భవన స్థలం విషయంలో ఒక రిట్ పిటిషన్ విషయంలో హైకోర్టుకు తప్పుడు ప్రొసీడింగ్ జి1/180/కెఎల్‌పిఆర్/2021 తేదీ :15-11-2021 రోజున ఇచ్చారని, దాని వల్ల కొల్లాపూర్ బీసీ ముదిరాజ్ కమ్యూనిటీ భవనం కూల్చివేతకు గురైందని పేర్కొన్నారు. భవన విషయంలో న్యాయం పోరాటం చేస్తున్నామని, ఆ విషయంలో తమకు మద్దతుగా ఉండాలని విశారదన్ మహరాజ్‌కు కొల్లాపూర్ ముదిరాజ్ కమ్యూనిటీ నాయకులు లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేశారు. డాక్యుమెంట్లనుపరిశీలించి, ముదిరాజ్‌లకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని విశారదన్ మహరాజు వారికి భరోసా కల్పించారు. ముదిరాజ్ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జింకల గణేష్, నిర్వాహక అధ్యక్షుడు కోట్ల రమేష్, కొల్లాపూర్ ముదిరాజ్ సంఘం బాధ్యులు తూర్పు కుమారస్వామి ఉన్నారు.

బీటీ రోడ్డు మంజూరు

తాడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి నాగర్‌కర్నూల్-జడ్చర్ల ప్రధాన రహదారికి ఆనుకుని ఉండే కొమ్ముగుట్ట వద్దకు ఉన్న మూడు కిలో మీటర్ల మట్టి రోడ్డు బీటీగా మంజూరు అయ్యిందని పంచాయతీరాజ్ ఏఈ శివకృష్ణ తెలిపారు. 2కోట్ల 70లక్షల రూపాయలతో బీటీ రోడ్డుగా మార్చనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రజా చైతన్యానికి కళాకారులు పాటుపడాలి

- ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా నరసింహ

కల్వకుర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజా చైతన్యానికి కళాకారులు పాటుపడాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ పిలుపునిచ్చారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా ప్రజానాట్య మండలి జిల్లా మహాసభలు జరిగాయి. ప్రజల్లో ఉన్న మూఢ విశ్వాసాలను తొలగించేందుకు పాటలు ఎంతో దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.ఆంజనేయులు, నాయకులు బాలస్వామి, జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

● నూతన కమిటీ ఎన్నిక : ప్రజానాట్య మండలి జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నల్లవెల్లి వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా రాసమల్ల లక్ష్మయ్య, గౌరవ అధ్యక్షుడు బి.జగన్, ఉపాధ్యక్షులుగా నిరంజన్, మురళి, విజయ్, రవి, సహాయ కార్యదర్శులుగా లక్ష్మమ్మ, రాము, రాఘవ, బాబు, భీంరాజు, సభ్యులుగా సరస్వతి, సుధాకర్, సత్యం, శ్రీను, మల్లేష్, ఏ.లక్ష్మణ్, రామచంద్రయ్య, పాలది రేణుకలు ఎన్నికయ్యారు.



జిల్లా మహాసభలో అభివాదం చేస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఊర్కొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం వద్ద సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్‌చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం దళారులకు విక్రయించకుండా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని కోరారు. మద్దతు ధరతోపాటు సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500/- బోనస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో దీప్తి, పీఏసీఎస్ సీఈవో వెంకట్‌రెడ్డి పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయం చైర్మన్ సత్యనారాయణరెడ్డి, నాయకులు వెంకటయ్యగౌడ్, తిరుపతిరెడ్డి, వీరెడ్డి పర్వత్‌రెడ్డి, మ్యాకల శ్రీనివాసులు, మహ్మద్ ఖాజ, అయూబ్‌పాషా, ఫరీద్, వెంకటయ్య, లక్ష్మారెడ్డి, యాదయ్య, ప్రసాద్, బంగారయ్య ఉన్నారు.



ఊర్కొండలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి

గ్రామాల్లో పేదలకు అందని ఇందిరమ్మ ఇళ్లు

- బీజేపీ జిల్లా నాయకుడు తమటం సాయికృష్ణ గౌడ్

కొల్లాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు గ్రామాలలో ప్రతీ పేదవాడికి అందడం లేదని బీజేపీ జిల్లా నాయకుడు తమటం సాయికృష్ణగౌడ్ ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో లబ్ధిదారుల పేర్లు నమోదు చేస్తూ వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. అవి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించినవా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో మంజూరైనవా అధికారులు తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. ఇళ్లు మంజూరై, లబ్ధిదారుల పేర్లు వచ్చినా లబ్ధిదారులకు చెప్పకుండా ఎందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలస్యం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కడతాల కృష్ణయ్య, బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌రావు, భాస్కర్ గౌడ్, పరమేష్, రమేష్ గౌడ్, కురుమూర్తి నాయక్, రమేష్ యాదవ్, బాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు సాయికృష్ణ గౌడ్

ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రజావాణి మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 48అర్జీలు అందాయి. జిల్లా అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయంతో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ తమ పరిధిలో ఇప్పటి వరకు ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగాల అధికారులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్

పోలీసు ప్రజావాణికి 5 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ క్రైం, (ఆంధ్రజ్యోతి) : పోలీస్ ప్రజావాణికి ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల ఫిర్యాదుదారుల నుంచి భూమికి సంబంధించి 2, తగు న్యాయం గురించి 3 అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం సదుపాయం కల్పించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి గచ్చిబౌలికి డీలక్స్ సర్వీస్‌ను, శ్రీశైలానికి ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీ సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే కొద్దిసేపు బస్సును నడిపారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జిల్లెల రాములు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఉమామనీలా సంజీవ్‌కుమార్ యాదవ్, మాజీ కౌన్సిలర్ ఎజాస్, డిపో మేనేజర్ సుభాషిణి, అసిస్టెంట్ డిపో మేనేజర్ శ్వేత, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

ప్రజా సంక్షేమానికి పాటుపడతా : ఎమ్మెల్యే

వెల్దండ, (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సంక్షేమానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో నారాయణరెడ్డి పాల్గొన్నారు. సింగిల్‌విండో ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. 75 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కొండకత్వ కుంటలో చేపపిల్లల వదిలారు. ఇందిరమ్మ ఇంటి పనులను పరిశీలించారు. విద్యుత్ దీపాను ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో పీసీటీ సభ్యుడు బాలాజీసింగ్, నాయకులు మోతీలాల్, భూపతిరెడ్డి, పర్వత్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, కేశమళ్ల కృష్ణ, రాజశేఖర్, రషీద్, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, డీటీ కిరణ్‌కుమార్, ఏవో శోభ, సీఈవో శ్రీనివాసులు, పురుషోత్తమాచారి, ఎర్ర శ్రీను, నారాయణ, వెంకటమ్మ ఉన్నారు.

పేదలకు పక్కా ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

- మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గూడు నీడ లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ అన్నారు. మండల పరిధిలోని చెన్నపురావుపల్లిలో పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను సోమవారం వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వరద రాజుల వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు వి.సత్యం, పగడాల చిన్నయ్య, ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటస్వామి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రామచంద్రయ్య, ఆదిధర్మేందర్, కొల్లాపూర్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఎండి.రసూల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● కోడేరు, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రేకులపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్‌నాయక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు భాస్కర్, భాస్కర్‌బాబు నాయక్, పాప్యనాయక్, లాలు, కిషన్, జానకిరామ్, గణేష్, రవీందర్ పాల్గొన్నారు.



చెన్నపురావుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

నాగర్‌కర్నూల్‌కు తరలిన మాదాసి కురుమలు

కొల్లాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్య, ఉపాధి ఉద్యోగ రాజకీయ రంగాలలో ఆర్థికంగా చైతన్యవంతంగా వెనుకబడిన మాదాసి మాదారి కురుమలకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బేమిని బీరయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఆవరణంలో నియోజకవర్గ పరిధిలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మాదాసి మాదారి కురుమలు చేరుకున్నారు. డిల్లెం బల్లెం మోతలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం మాదాసి మాదారి కురుమలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని వెంటనే నిర్లక్ష్యం వీడి తమకు న్యాయం చేకూర్చాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు కొల్లాపూర్ పట్టణం నుంచి భారీగా తరలి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తహసీల్దార్‌లకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాదాసి మాదారి కురుమల నియోజకవర్గ అధ్యక్షులు గోపాల శేషయ్య, గౌరవ అధ్యక్షులు గొగొండ్ల ఈదన్న, సంఘం నాయకులు పర్వతాలు, రాముడు, మల్లయ్య తదితరులు ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మద్దెలబండ సాయిబాబు

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించిన ప్రైవేటు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మద్దెలబండ సాయిబాబు డిమాండ్ చేశారు. సోమవారం బీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ లేక యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫాం, పుస్తకాల పేరుతో వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు రాంచందర్, బీఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు అభిషేక్, గణేష్, రాజు, భానుప్రసాద్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆపదొస్తే అండగా నిలుస్తాం

- సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికాటి సత్యం

తిమ్మాజిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అధికారం లేకపోయినా, పేద వారికి ఏ కష్టం వచ్చినా కమ్యూనిస్టు పార్టీ అండగా నిలుస్తుందని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికాటి సత్యం అన్నారు. సీపీఐ శతవసంతాల సందర్భంగా ఖమ్మంలో డిసెంబరు 26న జరగనున్న వందేళ్ల ముగింపు సభ విజయవంతం చేయాలని కోరుతూ శనివారం గద్వాల నుంచి ప్రారంభమైన సీపీఐ బస్సు జాత సోమవారం తిమ్మాజిపేటకు చేరుకుంది. ఈ బస్సుజాతకు సీపీఐ, ఏఐటీయూసీ కార్మిక నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఎండీ ఫయాజ్, సీపీఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి కే.బాలకిషన్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, సీపీఐ జిల్లా నాయకులు ఎండీ ఖాజామొయినుద్దీన్, కే.రాము, ఈర్ల చంద్రమౌళి, కృష్ణాజీ, ఈర్ల భూపేష్, ఏఐటీయూసీ నాయకులు జీవన్, మధు, కృష్ణ, ఆంజనేయులు, వెంకటయ్య పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్ (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని జిల్లా కార్యదర్శి పయాజ్ అన్నారు. రెండవ బస్సు జాత పట్టణానికి చేరుకున్నది. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 26న ఖమ్మం జిల్లాలో ముగింపు సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి పెర్మాల గోపాల్, బీసీ సంఘం నాయకులు కాశన్న యాదవ్, నాయకులు ప్రేమ్, తిరుపతయ్య, దేవి పాల్గొన్నారు.



తిమ్మాజిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఐ నాయకులు